మతిస్థిమితం లేని మహిళ మానసిక వైద్యశాలకు తరలింపు



మతిస్థిమితం లేని మహిళను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసు సిబ్బంది

చెన్నూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాయపల్లె రోడ్డులో మతిస్థిమితం లేని మహిళను స్థానిక పోలీసులు మంగళవారం మనోబంధ్ ఫౌండేషన్ ద్వారా కడప నగరంలోని మానసిక వైద్యశాలలో చేర్పించారు. రెండు రోజులుగా ఆ మహిళ చెన్నూరు, కొక్కిరాయపల్లె గ్రామాల్లో తిరగడంతో పాటు ఆమె మాట్లాడే మాటలు కూడా అర్థం కాని ఇతర భాషల్లో ఉండడంతో ఆ మహిళను మతిస్థిమితం లేనిదని స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మహిళకు 30-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది.

జాతీయ స్థాయి పోటీలకు చంద్రమౌనిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం, తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చంద్రమౌనిక 69వ జాతీయ స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టులో చోటుదక్కించుకుంది. ఫిజికల్ డైరెక్టర్లు విజయలక్ష్మి, ఉమాదేవి పర్యవేక్షణలో నిరంతర సాధనతో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో మెరిసిన మౌనిక గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, ఎంఈవో రఫీక్ అహ్మద్, పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు గంగనపల్లె విద్యార్థినులు



ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన గంగనపల్లె విద్యార్థినులు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో ఈనెల 24 నుండి 25 వరకు జరిగిన అండర్-17 బాలబాలికల 69వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. బాలికల పోల్‌వాల్ట్ విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు వి.ముబీనా ప్రథమ, వి. సాహిదా ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. డిసెంబరు 13 నుండి 17 వరకు ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఎర్రచందనం చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితులకు తిరుపతి కోర్టు మంగళవారం శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ చెక్‌పోస్టు సమీపంలో 2014 సెప్టెంబరు 21వ తేదీన 40కేజీల బరువు ఉన్న ఆరు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న సంపంగి రఘురాం, భూపాలం నాగరాజు, పోలిశెట్టి చంద్రశేఖర్, కొర్లకుంట తారకరామిరెడ్డిలను అప్పటి ఎస్ఐ టి.సంజీవరెడ్డి పట్టుకుని అదే రోజున కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈనేపథ్యంలో 2017 జనవరి 16న కమలాపురం కోర్టు జడ్జి ఆరునెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అయితే నిందితులు తిరుపతి రెడ్ శాండల్ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. అయితే తిరుపతి కోర్టు జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం సదరు నిందితులకు కింది కోర్టు విధించిన ఆరునెలల జైలు శిక్షను అమలుపరచాలని ఆదేశించారు. నిందితులను, సాక్షులను హాజరుపరచడంలో కృషి చేసిన సీఐ విశ్వనాథరెడ్డి, తిరుపతి కోర్టు లైసన్ ఆఫీసర్ హెచ్‌సీ సుబ్బయ్య, ఎర్రగుంట్ల హోంగార్డు ఎం.పుష్పరాజ్‌ను ఉన్నతాధికారులు అభినందించినట్లు సీఐ తెలిపారు.

కలిసిరాని ఉల్లి, అరటి సాగు

ఉల్లి, అరటి పంటల సాగు రైతులకు అచ్చిరాలేదు. కిందటి సంవత్సరం ఈ పంటలు సాగు చేసిన రైతులు మంచి లాభాలు గడించారు. ఇదే బాటలో ధరలు కొనసాగుతాయని ఆశించిన పలువురు సాగుకు పూనుకున్నారు. పరిస్థితులు వికటించి నష్టాలను మూటకట్టుకున్నారు. మండల పరిధిలోని రామాపురం రైతులు ఆ గ్రామంలో ఉల్లి, అరటి సాగుతో ఇంచుమించు రూ.2 కోట్లు పెట్టుబడుల కింద వెచ్చించి నష్టపోయారు. ఒకేఒక్క గ్రామంలో రైతులు ఇలా భారీగా నష్టపోవడం అరుదు అని పలువురు భావిస్తున్నారు.

- రామాపురం రైతులకు రూ.2 కోట్ల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతాంగం



చెట్టుకే వదిలేసిన అరటి గెలలు

దువ్వూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో వ్యవసాయమే జీవనాధారంగా కొనసాగుతోంది. ఇక్కడి రైతులు పండ్లు, కూరగాయలు, పూల తోటలతో పాటు ఉల్లి, అరటి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు కూడా సాగు చేస్తారు. ఈ క్రమంలో మంచి లాభాలు కూడా గడిస్తుంటారు. కానీ ఈ సంవత్సరం మార్కెట్‌లో ఉల్లి, అరటి పంటలకు సరైన డిమాండ్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వీటిని సాగు చేసి పెద్ద మొత్తంలో నష్టాలను మూటగట్టుకున్నారు. సరాసరి ఇక్కడ 300 ఎకరాల్లో ఉల్లి, 60 ఎకరాల్లో అరటి తోటలు సాగు చేశారు. పెట్టుబడుల కింద వీటి సాగుకు పెద్ద మొత్తంలో ఖర్చు అయింది. అయితే ఈ ఏడాది పొలంలో కురిసిన అధిక వర్షాలు, ఇతరత్రా కారణాల కారణంగా నేలలోనే ఉల్లిని, చెట్లపైనే అరటి గెలలను కొన్ని తోటల్లో గాలికొదిలేశారు. మరికొన్ని తోటలు ఇంకాకాపునకు రాలేదు. ఎకరాకు సరాసరి రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. ఉల్లి సాగుకు రూ.60వేలకు పైగా ఖర్చు వచ్చిందని చెబుతున్నారు. ఈ ప్రకారం రామాపురం గ్రామంలోని రైతులకు రూ.2 కోట్లు దాకా పెట్టుబడులకే వెచ్చించినట్లు తేటతెల్లం అవుతోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా కొనుగోలు జరుగకపోవడంతో చిల్లిగవ్వ కూడా చేతికందలేదని బావురమంటున్నారు.



పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

చిల్లిగవ్వ కూడా చేతికి అందలేదు..



అయిదు ఎకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి వేస్తే చిల్లిగవ్వ కూడా చేతికందలేదు. రూ.3 లక్షలు సాగు ఖర్చుల కింద వెచ్చించాను. పంటను నేలకొదిలేశాను. అప్పులు మూటగట్టుకున్నాను. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

- వైకుంఠం ఆంజనేయులు, రామాపురం

రూ.2.50 కోట్లు నష్టపోయాం..



మా ఊరిలో ఉల్లి, అరటి సాగు చేసిన రైతులు సుమారుగా రూ.2.50 కోట్లు నష్టపోయారు. వెనుక అదును వేసిన అరటి ఇంకా కాపు రాలేదు. ముందుగా వేసిన తోటల్లో గెలలు మాగడంతో గొర్రెల మేత కోసం వదిలేశాం. లేత తోటల్లో కాపు సమయానికి ధర వస్తుందని ఆశిస్తున్నాం.

- గుర్రం కొండలరావు, రామాపురం రైతు

ఎంపీ సీఎం రమేష్‌కు ఎమ్మెల్యేల పరామర్శ



అనకాపల్లి ఎంపి సీఎం రమేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ రాజు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎంరమేష్‌ను పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పోట్లదుర్తిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి రత్నమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వారంరోజులుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆమెను పోట్లదుర్తికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి ఇప్పటికి క్రిటికల్‌గానే ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎం.లింగారెడ్డి, షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, పలువురు ప్రముఖులు రత్నమ్మను మంగళవారం పరామర్శించి ఆమె ఆరోగ్యంపై ఎంపీ సీఎం రమేశ్‌ను, రమేశ్ తండ్రి మునిస్వామినాయుడుని, సీఎం సురేశ్, సీఎం రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రారంభమైన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు మంగళవారం నుండి కడపలో ప్రారంభమయ్యాయి. నగర శివారులోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టఆఫ్ నార్త్ జోన్- రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ జట్ల మధ్య సాగింది. తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ నార్త్‌జోన్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పి.పండిత్ 97 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్ చేపట్టి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 41 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో రెస్టఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మరో 220 పరుగుల వెనుకబడి వుంది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నార్త్‌జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌కు దిగి తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 276 పరుగుల భారీ స్కోర్ దిశగా సాగుతోంది. కేపీ శ్రీరామ్ 177 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్టఆఫ్ సౌత్‌జోన్-సెంట్రల్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్టఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్ చేపట్టి 66.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 224 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె.కిశాల్ 74 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ఇందులో కె. ధమన్‌సాయి 33 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

నేడు ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం



వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేలు పట్టణానికి చెందిన వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బద్వేలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నన్ను ఎంతగానో ఆదరిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న బద్వేలు నియోజకవర్గ ప్రజానికానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో జిల్లా జట్టు



ట్రోఫీతో కడప జిల్లా బాలుర జట్టు

కడప స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈనెల 23 నుండి 26 వరకు జరిగిన ఏపీ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలురు జట్టు విజేతగా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ చంద్రమోహన్‌రాజు వెల్లడించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ములకలచెరువు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నిపుణులు రత్నశేఖర్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించిన వారు మాట్లాడుతూ గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, కృష్ణప్ప, జయచంద్రారెడ్డి, రేష్మా, అల్తాఫ్‌భాను, నిర్మలమ్మ, నేముులమ్మ, హెల్పింగ్ మైండ్స్ ఇన్‌చార్జి ముస్తఫా పఠాన్ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న ఆర్టీసీ బస్టాండ్

- పై పూతలతో మ..మ.. అనిపిస్తున్న వైనం
- శ్రద్ధ చూపని డిపో అధికారులు



కడప బస్టాండ్ ప్లాట్‌ఫాం పైకప్పు దుస్థితి

కడప మారుతీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అది ఆర్టీసీ కడప రీజియన్‌కు గుండెకాయ లాంటి కడప డిపో. నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో సందడిగా వుంటుంది. కడప డిపో బస్సులే కాకుండా రీజియన్ పరిధిలోని మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల నుండి, అలాగే తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుండి కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికుల తాకిడి మరీ ఎక్కువగా వుంటుంది. ఇదిలా వుండగా కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో గత ఆగస్టు 15 నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య మరింతగా పెరగడంతో బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. అందుకు తగ్గట్టుగా బస్టాండ్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం మంచి నీరు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా వుంచే ఏర్పాట్ల విషయంగా ఆయా డిపోల అధికారులు దృష్టిసారించాల్సి వుంది. అంతేకాకుండా బస్సుల రాక కోసం వేచివుండే ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలు, ఫ్యాన్లు వున్నాయి కానీ బస్టాండు బిల్డింగ్ మాత్రం అక్కడక్కడా పెచ్చులూడుతోంది. ఈ తంతు గత రెండు, మూడు సంవత్సరాలుగా సాగుతున్నా పై..పై పూతలతో మసి పూసి మారేడుకాయను చేసినట్లుగా మ....మ... అనిపిస్తున్నారు. బస్టాండ్ భవనంలోకి ప్రవేశించగానే కనిపించే కుడి వైపున ఉన్న గదులు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఆ రూముల పైభాగం పెచ్చులు కింద పడేందుకు సిద్ధం అన్నట్లుగా వున్నాయి. వర్షం వస్తే చాలు బస్టాండ్ ఏటీఎం వద్దనున్న కిరాణా షాపుల వద్ద వర్షపునీరు పై నుంచి కురుస్తుంది. వర్షపు నీరు కింద పడకుండా ఎన్ని తూ..తూ మంత్రాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆ కోవలో బస్టాండ్‌లో బస్సులు నిల్చునే ప్లాట్‌ఫారం భవనం పైకప్పు అక్కడక్కడా పెచ్చులూడుతోంది. పై..పై మరమ్మతులతో సరిపెడుతున్నా పెచ్చులూడడం పరిపాటిగా మారింది. ఇటీవల కొంత భాగం పెచ్చులూడడంతో పైపై మెరుగులు దిద్దేందుకు పూనుకున్నారే కానీ ఎందుకో పని మొదలెట్టలేదనే వాదనలున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా వుండే ఆర్టీసీ కడప బస్టాండ్ భవనం పెచ్చులూడే స్థితికి చేరుకున్నందున భవనానికి సరైన మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం దుస్థితి

టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



ఉత్కంఠగా అంతర్‌కళాశాలల క్రీడలు

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో జరుగుతున్న అంతర్‌కళాశాలల క్రీడా పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. మంగళవారం వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. చెస్ ఫైనల్స్ పోటీల్లో ఉదయగిరి వ్యవసాయ కళాశాల, క్యారమ్స్ ఫైనల్స్‌లో బాపట్ల ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాల, బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో నైరా వ్యవసాయ కళాశాల, జట్టు విజయం సాధించాయి. అలాగే బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, పులివెందుల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, 19 కళాశాలల స్టూడెంట్ యాక్టివిటీ అధికారులు, పీడీలు, సిబ్బంది హాజరయ్యారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోపీకృష్ణ

సీకేదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగ అధిపతి డాక్టర్ టి.గోపీకృష్ణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సాంకేతిక కార్యక్రమాలపై మంగళవారం సమీక్ష నిర్వహించి శాస్త్రవేత్తలకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం చింతకొమ్మదిన్నె మండలంలోని అసోసియేషన్ డీన్ ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డితో కలిసి ఇప్పెంట, జమాల్‌పల్లి గ్రామాల్లోని విద్యార్థులు క్షేత్రస్థాయిలో పొందుతున్న విజ్ఞానాన్ని, స్థానిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకుని అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యాన్ని పొందాలన్నారు. అనంతరం కేవీకే సిబ్బందితో కలిసి వర్మీకంపోస్టు కేంద్రాన్ని, పుట్టగొడుగుల పెంపకం, కోళ్లపెంపకం, గొర్రెలు, మేకల పెంపక కేంద్రాన్ని పరిశీలించారు. చిరుధాన్యాలకు విలువ జోడింపు కేంద్రాన్ని, యంత్రపరికరాలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కేవీకే, డాట్‌సెంటర్ సమన్వయకర్తలు అంకయ్యకుమార్, కృష్ణప్రియ, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సీకేదిన్నె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిపై మద్దిమడుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ కరిమున్నీసా (32) మృతి చెందగా ఆమె భర్త పీరు బాషా, కుమార్తెకు గాయాలయ్యాయి. మంగళవారం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మద్దిమడుగు దాటిన తర్వాత ఘాట్ సమీపంలో రాయచోటి వైపు నుండి కడపకు వస్తున్న లారీ, కడప నుండి రాయచోటికి వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో కిందపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని అంగడివీధికి చెందిన కరిమున్నీసా అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అటువైపు వెళ్లే వాహనదారులు సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన రాత్రి 8 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కరిమున్నీసా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తాళలేక రైతు ఆత్మహత్య

- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



చెన్నారెడ్డి (ఫైల్)

పులివెందుల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం యాదవకుంట గ్రామానికి చెందిన వల్లెపు చెన్నారెడ్డి అనే రైతు వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం చెన్నారెడ్డి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిన లేఖ లభ్యమైంది. కుటుంబీకులు, ఆత్మహత్య నోట్ ప్రకారం వివరాల్లోకెళితే... వేముల మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన బాలగంగిరెడ్డి, ఓబుల్‌రెడ్డిల దగ్గర సుమారు రూ.1.80లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఒకరి వద్ద రూ.80వేలకు గాను వడ్డీతో కలిపి దాదాపు రూ.4లక్షలు చెల్లించాడు. అలాగే మరో వ్యక్తి వద్ద లక్ష రూపాయలు తీసుకున్నందుకు రూ.6 లక్షలకు బాండు రాయించుకున్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారస్తుల నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతోపాటు ఇంటి వద్దకు వచ్చి తీవ్ర ఒత్తిడి చేయడం వల్ల విష పుగుళికలు తిని ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో చెన్నారెడ్డి పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



చెన్నారెడ్డి రాసిన సూసైడ్ నోట్

ఇసుక అక్రమ రవాణాపై పోలీసు దాడులు

- రెండు ఎక్స్‌కవేటర్లు, 6 ట్రాక్టర్లు, రెండు టిప్పర్ల పట్టివేత




ప్రొద్దుటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పెన్నానది నుండి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రూరల్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో చౌడూరు గ్రామ పరిధిలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుకను ఎక్స్‌కవేటర్లతో ట్రాక్టర్లు, టిప్పర్లకు లోడ్ చేసి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాలకు తరలిస్తుండంతో దాడులు నిర్వహించారు. పోలీసుల దాడులతో ట్రాక్టర్లను, టిప్పర్లను వదిలేసి డ్రైవర్లు పరారయ్యారు. దీంతో రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసు స్టేషనుకు తరలించారు. ఈ ఇసుక అక్రమ రవాణాలో పద్మనాభరెడ్డితో పాటు మరికొందరు వున్నట్లు పోలీసులు వెల్లడిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్లు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
బుధవారం 26 నవంబరు 2025



కొత్తగా 158 పోలింగ్ కేంద్రాలు

- కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ స్టేషన్
- పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్‌లో సిబ్బంది బిజీబిజీ
- జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 2,121
- 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు రెండు నెలలుగా కొత్త పోలింగ్ కేంద్రాల కసరత్తు సాగింది. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 158 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పోలింగ్ సమయంలో సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఇప్పుడు 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అనుమతుల కోసం జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపారు.



కడప కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో ఇటీవల చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో కొత్తగా 158 పోలింగ్ కేంద్రాలు ఏర్పడనున్నాయి. గత ఎన్నికల నాటికి జిల్లా వ్యాప్తంగా 16.27 లక్షల మంది ఓటర్లుండగా 1,963 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లుండేవారు. ఓటర్లు ఎక్కువగా ఉండడంతో ఎన్నికల రోజున రాత్రి వరకు క్యూలో ఉండి ఓట్లు వేయాల్సి వచ్చేది. పోలింగ్ సిబ్బందికి, పోలీసు యంత్రాంగానికి ఈవీఎంలు గోడౌన్లకు చేరేంత వరకు కంటిమీద కునుకు ఉండేది కాదు. మరో పక్క రిగ్గింగ్ చేశారనో.. అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు వేసుకున్నారనే దూమారం రేపేవారు. అలాంటి వాదనలకు అవకాశం లేకుండా భారత ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల ప్రక్షాళనకు దిగింది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లకు మించకూడదని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఎన్నికల సిబ్బంది చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో 7 నియోజకవర్గాల పరిధిలో 158 కొత్త పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు నియోజకవర్గాల ఎలక్షన్ రిటర్నింగ్ అధికారులు నివేదికలు అందజేశారు. కొత్తపోలింగ్ కేంద్రాలపై కలెక్టర్ రాజకీయ పార్టీలతో సమీక్షించి ఆమోదానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ఉన్న 1,963 పోలింగ్ కేంద్రాలకు 158 కలుపు కుంటే వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి 2,121 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.

ఒకే పోలింగ్ కేంద్రంలోనే కుటుంబం ఓట్లు

గత ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ అడ్డగోలుగా చేపట్టారు. దీంతో ఏళ్ల తరబడి ఒకే గ్రామం, ఒకే పోలింగ్ కేంద్రంలో ఉన్న కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాలలో ఓట్లు వేయాల్సి వచ్చింది. ఇది గందరగోళానికి దారి తీసింది. అంతేకాక దూరాభారం వెళ్లలేక కొందరు ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కుటుంబంలోని ఓటర్లం తా ఒకే పోలింగ్ బూతులో ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కుటుంబంలోని వారంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం దక్కనుంది.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

నియోజకవర్గం	కొత్తవి	మొత్తం
ప్రొద్దుటూరు	42	310
కడప	39	326
బద్వేలు	17	289
పులివెందుల	8	309
కమలాపురం	28	279
జమ్మలమడుగు	10	325
మైదుకూరు	14	283
మొత్తం	158	2,121

ప్రొద్దుటూరులో అత్యధికం

జిల్లాలో చేపట్టిన పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అత్యధికంగా 42 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అత్యల్పంగా పులివెందులలో 8 ఏర్పాటు కానున్నాయి. 5 నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల భవనాలకు సంబంధించి 11 కేంద్రాల్లో మార్పులు చేపట్టనున్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగం

గత ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రంలో 1,500 వరకు ఓటర్లు ఉండేవారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గందరగోళంగా ఉండేది. ఇప్పుడు 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో ఓటు హక్కు సులభంగా మారనుంది. అంతేకాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లంతా ఓటువేసే అవకాశం కల్పిస్తున్నాం. ఎన్నికల విభాగం సిబ్బంది పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ చేపడుతున్నారు.

- విశ్వేశ్వరనాయుడు, జిల్లా ఎన్నికల సహాయ అధికారి, డీఆర్వో

702 సెల్‌ఫోన్లు రికవరీ

- బాధితులకు ఫోన్ల అప్పగింత
- జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఫోన్లు రివకరీ చేశాం : ఎస్పీ



రికవరీ అయిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలువురు పోగొట్టుకున్న 702 సెల్‌ఫోన్లను సైబర్ సెల్ పోలీసులు రికవరీ చేశారు. దాదాపు రూ.1.86 కోట్ల విలువైన ఈ మొబైల్ ఫోన్లను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ చేతుల మీదుగా బాధితులకు అందించారు. అనంతరం అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, సైబర్ సెల్ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డితో కలిసి ఎస్పీ మీడియాతో మాట్లాడారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంటు ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 702 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఏడు విడతల్లో మొత్తం 5,372 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. అధునాతన డిజిటల్ ఫోరెన్సిక్ జీపీఎస్ ట్రాకింగ్, ఐఎంఈఐ ట్రేసింగ్, సైబర్ నిఘా టూల్స్ ద్వారా మిస్సింగ్ అయిన ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించామన్నారు. మొబైల్ మిస్సయినప్పుడు, లేదా ఇతరులు ఎవరైనా దొంగలించినప్పుడు తక్షణమే బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయడంతో పాటు సిమ్‌కార్డును బ్లాక్ చేసుకోవాలన్నారు. మొబైల్ పోయిన వెంటనే వాట్సాప్ నెంబరు 9392941541కు కాల్ చేసి వివరాలు తెలపాలని అలాగే సీఈఐఆర్ పోర్టల్ గూగుల్‌లో సెర్చ్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చన్నారు. సంబంధిత పోలీసుస్టేషన్లలో కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎవరైనా తక్కువ ధరకు అమ్మే ఫోన్లను తీసుకోవద్దని సూచించారు. సెకండ్ హ్యాండ్ ఫోను కొనేటప్పుడు సెల్‌ఫోను బాక్సు, బిల్లుతో పాటు కచ్చితంగా ఫోను అమ్మిన వ్యక్తి వివరాలు తీసుకోవాలన్నారు.

మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

- ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తే ఫిర్యాదు చేయండి: ఎస్పీ

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లాలో మహిళలు, ప్రజలకు అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శక్తి బృందాలు, ఉమెన్ హెల్ప్ డెస్క్‌లు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 2025 సంవత్సరంలో తాము అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళలు, విద్యార్థినులకు చట్టాలు, ఆత్మరక్షణపై అవగాహన కల్పించడానికి శక్తి బృందాలు మార్చి 22 నుంచి నవంబరు 24 వరకు విస్తృతంగా పనిచేశాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,110 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వాటిలో 96,852 మంది పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థినుల్లో మనోధైర్యం కల్పించేందుకు 157 సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కుటుంబ సమస్యల పరిష్కారం కోసం కడప మహిళా పోలీసు స్టేషనులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 686 జనరల్ పిటిషన్లు రాగా, కౌన్సెలింగ్ ద్వారా 518 కేసులను రాజీ కుదిర్చామన్నారు. ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లకు 2,083 ఫిర్యాదులు వచ్చాయన్నారు. శక్తి యాప్‌ను ప్రతి మహిళ తమ ఫోనులో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 25,494 మంది యాప్‌లో రిజిస్టరు అయ్యారన్నారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత ఫొటోలు, సమాచారం పంచుకోవద్దన్నారు. ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తే భయపడకుండా ఫిర్యాదు చేయాలన్నారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, లేదా గృహహింస ఎదురైతే వెంటనే దగ్గరలోని ఉమెన్ హెల్ప్ డెస్క్ లేదా శక్తి బృందాన్ని సంప్రదించాలన్నారు. ఇందుకోసం డయల్ 100, 112, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలన్నారు.

రైతు ముంగిటకు వ్యవసాయ సేవలు

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం ద్వారా లభించే సేవలను వారికి వివరిస్తూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు భరోసా కల్పిస్తున్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. గ్రామ స్థాయి బృందాలు 72,971 రైతు కుటుంబాలను కలిసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు పంచసూత్రాల ప్రాముఖ్యతను వివరించి సీఎం సందేశాన్ని అందజేసినట్లు వివరించారు.

అసభ్య ప్రచారంపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి మారుతీ మహాలక్ష్మి ఫిర్యాదు

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిత్వం హననం చేసేలా అసభ్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బ్రహ్మంగారిమఠం మఠం దివంగ గురుపత్ని మారుతీమహాలక్ష్మి మంగళవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా సోషల్ మీడియా ద్వారా తనపై అసభ్య ప్రచారాలు చేయడంతో విసిగి వేసారి గత ఏడాది మార్చిలో ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై కనీస చర్యలు లేకపోవడంతో కలెక్టర్, డీఐజీ, అడిషనల్ డీజీపీ, డీజీపీలకు పంపినా చర్యలు తీసుకోలేదన్నారు. నిందితుల మీద చర్యలు తీసుకోకపోవడం వల్ల, తనపై సోషల్ మీడియాలో మరింత ప్రచారం చేసి మానసిక వేదనకు గురిచేస్తున్నారని అన్నారు. హోంమంత్రికి, మంత్రి లోకేశ్‌కు, గవర్నరుకు విన్నపం చేసి సమాచారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలియజేసినట్లు ఆమె వివరించారు.

కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ ఖాతా

కడప కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ సృష్టించి మోసాలకు పాల్పడుతున్న వారిని ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరో కలెక్టర్ పేరుతో ఫేక్ వాట్సాప్ ఖాతా సృష్టించారని కార్యాలయం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఆ ఖాతా కలెక్టర్‌ది కాదని తెలిపారు. కలెక్టర్ ఫొటోలు వాడి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలో నకిలీ ఐడీలు సృష్టించి మెసేజ్‌లు చేస్తే స్పందించరాదని సూచించారు. ఇలాంటి ఫేక్ ఐడీలు సృష్టించే వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

34 మండలాలతో కడప జిల్లా

- సిద్దవటం, ఒంటిమిట్ట అన్నమయ్య జిల్లాలోకి..

(కడప-ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసం జిల్లాలను జగన్ అడ్డగోలుగా విభజించారు. నియోజకవర్గం ఒకచోట ఉంటే మండల కేంద్రాలు మరో డివిజనులో మరో జిల్లాలో ఉన్నాయి. దీంతో పాలనాపరంగా ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పునర్విభజనలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులను, ఎన్నో ఏళ్ల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన పునర్విభజనపై ఉపసంఘం సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఉన్న సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లా పరిధిలోకి రాజంపేట డివిజన్‌లోకి తీసుకువస్తున్నారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు రాజంపేట అసెంబ్లీ పరిధిలోవి కాగా.. ఇవి కడప జిల్లాలో ఉండేవి. ఇక అన్నమయ్య జిల్లా పరిధిలోకి రానున్నాయి. కడప జిల్లాలో 34 మండలాలు ఉంటాయి. కడప, కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆ యా మండలాలు యథాతథంగా ఉండనున్నాయి.

సరోగసీ చట్టాలను పాటించాలి

కడప కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) ఏఆర్‌టీ, సరోగసి చట్టాల్లోని నియమ నిబంధనలను వైద్యశాఖాధికారులు తప్పకుండా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం. డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా సరోగసీ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరరావు, పీజీ అండ్ ఎన్డీటీ నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీసుశీల, జీజీహెచ్‌ఎస్ డాక్టర్ వంశీధర్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన పోలీస్ దందా..!

- పోలీసుల బరితెగింపు వెనుక సూత్రధారులు ఎవ్వరు
- ఎవ్వరి ఏజంట్‌గా వచ్చాడీ వసంత్
- డిపార్ట్‌మెంట్‌పై పడ్డ మరక తొలగేనా..?



వ్యాపారి శ్రీనివాస్ ఇంట్లో పోలీసులు (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే వ్యాపార వాణిజ్య రంగానికి పేరొందిన ప్రొద్దుటూరులో ఫ్యాక్షనిజం, రౌడీయిజం, గూండాయిజం పోయి నేడు పోలీసుల గూండాయిజం పెరిగింది. కొందరు పోలీసు అధికారులు పైవారి అండతో సివిల్ పంచాయితీల సెటిల్‌మెంట్‌లకు బరితెగిస్తున్నారు. ప్రొద్దుటూరులో రెండు మూడు రోజులుగా బంగారు వ్యాపారి కిడ్నాప్, అతడిని సెటిల్‌మెంట్‌కు ఒప్పించేందుకు పోలీసులు చేసిన హంగామా సినిమాకు ఏమాత్రం తీసిపోలేదు. సీసీ ఫుటేజ్‌ల సాక్షిగా ఈ దందా బయటపడింది. సినిమాలో లాగా ఏకంగా పట్టణ నడిబొడ్డు నుంచి మఫ్టీలో వచ్చి వాహనంలో వ్యాపారిని అక్రమంగా ఎత్తుకెళ్లి నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి తుపాకీ గురిపెట్టి చావు భయం కల్పించారు. అతడి ఇంటికి వెళ్లి సెటిల్‌మెంట్ కోసం ఆస్తి పత్రాలు, కోట్ల సరుకున్న బంగారు దుకాణం తాళాలు తీసుకెళ్లారు. బాధితుడు న్యాయమూర్తి ముందు పోలీసులే కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టిన వైనాన్ని వివరించడంతో పాటు ఇంటికి వచ్చి కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, దుకాణం తాళాలు తీసుకెళ్లారని తెలిపారు. ఈ మేరకు సీసీ ఫుటేజ్ సాక్ష్యాలు ఇచ్చారు. దీంతో పాటు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా పోలీసుల చర్యలపై ఆగ్రహించారు. పత్రికలు, మీడియా పెద్దఎత్తున ప్రచారం చేయడంతో పోలీసుల సెటిల్‌మెంట్ దందాకు తాత్కాలికంగా తెరపడింది. ఇందులో కీలక పాత్ర పోషించిన సీఐపై ఎలాంటి విచారణ చేపట్టకనే కేవలం వీఆర్‌కు పంపారు. ఇంకా ఇందులో పాల్గొన్న మరికొందరు పోలీసులపై చర్యలు తీసుకోకుండా పోలీసు ఉన్నతాధికారులు తప్పించారని ప్రచారం జరుగుతోంది.

ఎవరీ వసంత్?

త్రీటౌన్ పోలీసు స్టేషన్లో నవంబరు 20న ఒక చీటింగ్ దౌర్జన్యం అపహరణ లాంటి కేసు తనికంటి శ్రీనివాస్ అతని సోదరుడు వెంకటస్వామిపై నమోదయింది. మరుసటి రోజే ఈ కేసును ఒన్‌టౌన్ సీఐ టేకప్ చేశారు. సాధారణంగా ఒక స్టేషన్ పరిధిలోని కేసును మరో స్టేషన్ వారు టేకప్ చేయాలంటే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలుండాలి. ఇలాంటి ఆదేశాలు డీఎస్పీ, ఎస్పీ ఇవ్వకపోయినా.. సీఐ టేకప్ చేశారంటే దీనివెనుక అంతకంటే పైస్థాయి పోలీసు అధికారి పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇక ఈ వ్యవహారంలో మరో పోలీసు అధికారి వసంత్ పాత్రపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిగా చెప్పుకున్న వసంత్ ఎవరి ఏజంట్‌గా ఈ దందాను ప్రత్యక్షంగా పర్యవేక్షించాడో ఇప్పటికీ బహిర్గతం కాలేదు. ఈ దందాలో పాల్గొన్న వసంత్‌పై పోలీసు అధికారులు ఎందుకు గోప్యం ప్రదర్శిస్తున్నారు. ఇతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది ప్రణాళికాబద్ధంగా పెద్దవాళ్ల అండతో సాగడం వల్లే కిడ్నాప్, అక్రమ నిర్బంధం, కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, దుకాణం తాళాల స్వాధీనం చేసుకోగలిగారని డిపార్ట్‌మెంటులోనే ప్రచారం సాగుతోంది.

బంగారు వ్యాపార దిగ్గజం పనేనా..?

ప్రొద్దుటూరు బంగారు వ్యాపారంలో దిగ్గజంగా పేరొందిన వ్యక్తి పేరు కూడా ఈ వ్యవహారం వెనుక ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రొద్దుటూరు బులియన్ మార్కెట్‌ను ఓ వ్యక్తి శాసిస్తున్నారు. తమకు తనికంటి శ్రీనివాస్ కంటగింపుగా మారాడని అందువల్ల అతన్ని ఈ తరహాలో దెబ్బతీయడానికి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని అసలు సూత్రధారితో కలిసి వ్యూహం పన్నారని మార్కెట్‌లో ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే పోలీసులపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించకపోతే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై పూర్తిగా నమ్మకం పోతుంది. కాగా.. ఈ కేసు విషయంలో సీఐపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. ఈ కేసును డీఎస్పీ భావనకు అప్పగించి విచారణ చేపట్టమని ఆదేశించారు.

లింగ సమానత్వమే లక్ష్యం



లింగ సమానత్వంపై కడపలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై వివక్ష, హింస, అసమానతలను తొలగించి లింగ సమానత్వాన్ని సాధించడమే నేషనల్ జెండర్ క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశ్యమని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. దేశవ్యాప్తంగా 2025-26 జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఉదయం జాతీయ స్థాయిలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జాతీయ జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీనికి కలెక్టరేట్ డీ బ్లాకులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరం నుంచి డీఆర్‌డీఏ అనుబంధశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ఈ ఏడాది 'మహిళలు మరియు బాలికలపై డిజిటల్ హింసను అంతం చేయడానికి ఐక్యం' అనే థీమ్‌తో మహిళలపై హింస నిర్మూలనకు నవంబరు 25న అంతర్జాతీయ జెండర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. దేశం ఆఫ్ లైన్, ఆన్‌లైన్ రెండింటిలోనూ లింగ ఆధారిత హింసను ఎదర్కోవడానికి తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందన్నారు. అంతకు ముందు నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి జిల్లాలోని స్వయం సహాయక సంఘ మహిళలు, అగన్వాడీ కార్యకర్తలు, వలంటీర్ సంస్థలు, అనుసంధాన శాఖల ఉద్యోగులతో మహవీర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈకార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఎంహెచ్‌వో నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, పోలీసు, మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల రైళ్లు ఫుల్

- పూణే-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 15 వరకు బెర్తులు రిజర్వు
- ప్రత్యేక రైళ్లలో స్లీపర్‌లదీ అదే పరిస్థితి



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాలధారుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగిన నేపథ్యంలో కన్యాకుమారి, ఎర్నాకులం, కొల్లాం ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో జనవరి వరకు బెర్తులు లభించని పరిస్థితి నెలకొంది. పూణే - కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) రెగ్యులర్ రైలులో జనవరి 15 వరకు బెర్తులు ఖాళీ లేవు. అలాగే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రతి గురువారం నాందేడ్ నుంచి కొల్లాంకు బయలుదేరే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07111), అజ్మీర్ నుంచి కోయంబత్తూర్ (06182), మచిలీపట్నం నుంచి కొల్లం (07103)కు డిమాండ్ ఏర్పడింది.

కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 15 వరకు నోబెర్త్

పూణే-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381)కు జనవరి 15 వరకు బెర్తులు నిండిపోయాయి. అత్యధిక శాతం అయ్యప్ప భక్తులు ఈ రైతులనే ఆశ్రయిస్తారు. గతంలో నాలుగు నెలల ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్నప్పుడు మాలధారణకు ముందే యాత్ర తేదీలకు అనుగుణంగా రిజర్వేషన్ పొందేవారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని రెండు నెలలకు కుదించడంతో అయ్యప్ప భక్తులకు ఆశించిన స్థాయిలో బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. దీనితో కడప మీదుగా ఎర్నాకులం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లను ఆశ్రయిస్తున్నారు.

వీక్లీ స్పెషల్ రైలుకు డిమాండ్

అయ్యప్ప స్వాముల రద్దీని పురస్కరించుకుని నాందేడ్ నుంచి కొల్లాంకు కడప మీదుగా మరో ప్రత్యేక రైలును నవంబరు, డిసెంబరు, జనవరి మాసాల్లో నడపనున్నారు. ఈ రైళ్లకు స్లీపర్ బెర్తులు ఫుల్ అయ్యాయి. ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. శబరిమల స్పెషల్ ట్రైన్ (07111) నవంబరు 27, డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1, 8, 15 తేదీల్లో నాందేడ్‌లో గురువారం ఉదయం 10గంటలకు ప్రారంభమై నిజామాబాద్, మేడ్చల్, కాచిగూడ, జడ్చర్ల, మహబూబ్ నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి మీదుగా అదేరోజు అర్ధరాత్రి 2.08 గంటలకు ఎర్రగుంట్లకు, 2.53కు కడపకు, 3.48కి రాజంపేటకు చేరుకుంటుంది. ఇది రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, విల్లుపురం, తిరుచ్చిరాపల్లె, ముదురై, శివకాశి మీదుగా శుక్రవారం అర్ధరాత్రి (తెల్లవారితే శనివారం) 3గంటలకు కొల్లాంకు చేరుకుంటుంది.

కడప మీదుగా కోయంబత్తూర్‌కు ప్రత్యేక రైలు

కడప మీదుగా కోయంబత్తూర్ వెళ్లే ప్రత్యేక రైలు (06182)లో స్లీపర్ బెర్తులు ఖాళీ లేవు. ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలు నవంబరు 30, డిసెంబరు 7 తేదీలలో మదార్‌లో రాత్రి 11.50గంటలకు బయలుదేరి అజ్మీర్‌కు అదేరోజు అర్ధరాత్రి 12.15గంటలకు చేరుకుంటుంది. వడోదర, సూరత్, నాందేడ్, కాచిగూడ, కర్నూలు సిటీ, గుత్తి మీదుగా మంగళవారం సాయంత్రం 5.23 గంటలకు ఎర్రగుంట్ల, కడపకు 6.05 గంటలకు, బుధవారం ఉదయం 8.30 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది.

మచిలీపట్నం నుంచి కొల్లంకు

అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు డిసెంబరు, జనవరి మాసాల్లో ప్రత్యేక రైలు కొనసాగనుంది. ఈ రైలులో కూడా స్లీపర్ బెర్తులు ఖాళీలు లేవు. ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలు డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16 తేదీలలో మచిలీపట్నం నుంచి కొల్లాంకు కడప మీదుగా శబరిమలకు వెళుతుంది. ఇది ఉదయం 11గంటలకు మచిలీపట్నంలో (రైలు నెంబర్ 07103) బయలుదేరుతుంది. విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లె మీదుగా అదేరోజు రాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరుకు, 11.30కు ఎర్రగుంట్ల, 12.10కి కడప, అర్ధరాత్రి ఒంటి గంటకు రాజంపేట చేరుకుంటుంది. రేణిగుంట, కాట్పాడి, తిరుపూర్, ఎర్నాకులం, కొట్టాయం మీదుగా కొల్లాంకు శనివారం రాత్రి 10గంటలకు వెళ్తుంది.

సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ కోరారు. ఈనెల 30వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి రావాలని పలువురు నేతలను కలిసినట్లు తెలిపారు.

'ఎమ్మెల్యే మాధవిని విమర్శించే స్థాయి మీకు లేదు'



మాట్లాడుతున్న తిరుమలేశ్

కడప మారుతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్. మాధవిని విమర్శించే అర్హత అవినీతి తిమింగళమైన వైసీపీ నగర అధ్యక్షుడికి లేదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్‌పార్క్ రోడ్‌లో ఉన్న టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో సంపాదనే ధ్యేయంగా పలు అవినీతి, అక్రమాలు సాగించారని ఆరోపించారు. నాడు సీఎం రిలీఫ్‌ఫండ్‌లో కమీషన్, కార్పొరేషన్ వర్క్‌లలో కమీషన్, ఇసుక, గ్రావెల్లో కమీషన్, లేఅవుట్ అప్రూవల్‌లో కమీషన్‌లతో నగర ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అక్రమసంపాదన లేకపోవడంతో మతిభ్రమించి టీడీపీపై బురదజల్లే కార్యక్రమానికి తెరలేపారన్నారు. సమావేశంలో టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కె. చక్రి, చిన్నబాబు, బిల్లా నవీన్, భరత్, అమృత్ తదితరులున్నారు.

మోక్షం ఎప్పుడు..?

అధ్వానంగా గ్రామీణ ప్రాంత తారురోడ్లు


గుంతలతో అధ్వానంగా ఉన్న చక్రాయపేటలో ప్రధాన రహదారి

చక్రాయపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే తారురోడ్లు గుంతలయమైపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తారురోడ్లు పూర్తిగా ధ్వంసమైపోయాయి. తారు రోడ్లు పరమ అధ్వానంగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాలంటే వాహన చోదకులు, ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉంది. ముఖ్యం గా చక్రాయపేట మండలంలోని గండికొవ్వూరు రోడ్డు, ఇసుకచింతలపల్లె రోడ్డు మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు కోరుకుంటపల్లెరోడ్డు, మహదేవపల్లె, బాటలోపల్లె రోడ్లు, అలాగే చిలేకాం పల్లె, గడ్డంవారిపల్లె గ్రామీణ తారురోడ్లు గుంతలమయమైపోయాయి. పై ప్రాంతాల రోడ్లకు తారురోడ్లు వేసి నాలుగు, ఐదు సంవత్సరాలు కాకముందే పూర్తిగా అయిపోయాయి. దీనికి కారణం ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇసుక ట్రాక్టర్లు, కంకర టిప్పర్లతో పాటు భారీ వాహనాలు రాకపోకలు తిరుగు తుండడంతో రోడ్లు మొత్తం నాశనమైపోయాయి. మండల కేంద్రంలో మోకాటిలోతు గుంతలు పడిపోయాయి. అలాగే గండికొవ్వూరు రోడ్డు చాలా ఇబ్బందిగా ఉంది.అతి మారుమూల ప్రాంతమైన వరుకుంటపల్లె రోడ్లు కూడా ధ్వంసం అయిపోయాయి. అలాగే గొందిపల్లెకు పోవాలన్నా రోడ్లు పాడైపోయాయి. అంతే కాకుండా పాపాఘ్ని నదిలో ఇసుక క్వారీ ఉండడంతో టిప్పర్లు, ట్రాక్టర్లు ఎక్కువ రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లన్నీ దెబ్బతినిపోతున్నాయి. గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తారురోడ్లు తిరిగి వేయించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు వస్తే గ్రామాలలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి.

రక్త నమూనాల సేకరణ



లింగాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పైలేరియా (బోదవ్యాధి) నిర్మూలనే లక్ష్యంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నా మని పులివెందుల డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొయినుద్దీన్ అన్నారు. మండలంలోని తేర్నాంపల్లె గ్రామంలో సోమవారం రాత్రి ఇంటింటా సర్వే చేసి ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఫైలేరియా క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను

బోధనకు దూరం చేయవద్దు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయొద్దని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్మిషన్లు, విద్యా కానుక, ఆన్‌లైన్ అప్‌డేట్స్, రెండు మెగా పేరెంట్స్ మీటింగులు, యోగాంధ్ర కార్యక్రమం వంటికారణాలతో ఉపాధ్యాయులు తరగతులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశంలో సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


'విలువైన భూమి ధారాదత్తం'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వందలకోట్ల విలువైన చారిటబుల్ ట్రస్ట్ భూమిని టీడీపీనేతలు దోచుకుంటున్నారని వైసీపీనేతలు మండిపడ్డారు. ట్రస్ట్ సభ్యుల పేరిట ఉన్న భూమిని దేవదాయ శాఖ అధికారులు వేలం వేయడం అన్యాయం అంటూ నినాదాలు చేశారు. మంగళవారం కడప నగరంపాత బస్టాండ్ సమీపంలో గల ఎండోమెంట్ స్థలంలో జరుగుతున్న నిర్మాణాల వద్ద వైసీపీ శ్రేణులు నిరసనలు చేపట్టారు. పేదల ప్రయోజనాల కోసం ఉండాల్సిన భూమిని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలకు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో వైసీపీనేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు రంగంలోకి దిగి శాంతింపజేశారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ ప్రాంత వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు హాజరైయ్యారు. అత్యంత భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు.



లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏకపక్షంగా ప్రకటించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోంది, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యే లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జరిగే ఆందోళనకు సీపీఎం నేతలు సంపూర్ణ మద్దతు తెలిపారు. మంగళవారం కడపలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి

సీకేదిన్నె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులకు పాడిపశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్య అధికారి శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిల్లో రౌడీషీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక వర్షాల వల్ల బూడిద తెగులు


మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల పంటలకు బూడిద తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని శాస్త్రవేత్త సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని సంబటూరు,పాచికలపాడు గ్రామంలో మినుము ,శనగ పంటలను ఏడీఏ నరసింహారెడ్డితో కలిసి శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త మాధురి సాయిల్, యాస్మిన్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ, ఏవో సరస్వతి, నాగభూషణ్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న, సంబటూరు సర్పంచ్ యల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారిత పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి, శ్రీనివాసరెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు డిమాండ్ ఆధారిత పంటల సాగుకు ప్రాధాన్యతనివ్వాలని బీటెక్ రవి పేర్కొన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హిమకుంట్ల సచివాలయ పరిధిలో జరిగిన సమావేశంలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి), టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మెన్లు రామసూరారెడ్డి, గడ్డం అమర్‌నాథ్ యాదవ్, ఏడీ రామమోహన్‌రెడ్డి, డీహెచ్ఓ సతీష్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ రామాంజులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులానికి శంకుస్థాపన

వేముల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గన్నగారిపల్లెలో మినీ గోకులం నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి సోదరుడు పేర్ల శేషారెడ్డి టెంకాయ కొట్టి పూజలు చేశారు. ఉపాధి హామీ ఈసీ మధుసూదన్‌రెడ్డి, దుగ్గన్నగారిపల్లె వసంతరెడ్డి, గంగాధర్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు సమాజాన్ని నిలబెట్టే నిజమైనశక్తులు

కమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మహిళలు సమాజాన్ని నిలబెట్టే నిజమైనశక్తులని జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఎలిమినేషన్ ఆఫ్ వియోలెన్స్ ఎగైనెస్ట్ విమెన్ అనే అంశంపై కమలాపురం మండల లీగల్ సర్వీసెస్ అధారిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, గురవయ్య, ఉదయకిరణ్; నరసింహారెడ్డి, కోర్టుసిబ్బంది, కమలాపురం ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా దేవగుడి సినిమా

నిర్మాత, దర్శకుడు బెల్లం రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న దర్శకుడు బెల్లం రామకృష్ణారెడ్డి

కడప కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా రాయలసీమ నేపథ్యంలో చిత్రీకరించిన దేవగుడి సినిమా తప్పక విజయం సాధిస్తుందని ఆ సినిమా నిర్మాత, దర్శకుడు అన్నమయ్యజిల్లా రాయచోటికి చెందిన బెల్లం రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బాలాజీనగర్ శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దేవగుడి సినిమా హీరో...హీరోయిన్ అభినవ్ శౌర్య, అనుశ్రీలతో కలిసి మాట్లాడారు. దేవగుడి కంటెంట్ తీసుకుని ఇద్దరు స్నేహితుల మధ్య సాగే ఎమోషనల్ డ్రామా ఆసక్తికరంగా వుంటుందన్నారు. ఫ్యాక్షన్ నేపథ్యంలో సాగుతూ డిఫెరెంట్ కమర్షియల్ మూవీగా తెరకెక్కిందన్నారు. డిశంబర్ 19న సినిమా రెండు తెలుగు రాష్ట్రాలలో విడుదల కానుందన్నారు.

స్పర్శ లేని మచ్చలు ఆరోగ్యానికి హానికరం



కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరీరంపై స్పర్శ లేని మచ్చలున్నా, మందమైన జిడ్డు గల చర్మం ఉబ్బెత్తుగా ఉన్నా అవి కుష్టువ్యాధి లక్షణాలు అని అలాంటి వాటి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో డాక్టర్ రవిబాబు అన్నారు. కుష్టువ్యాధిని గుర్తించే కార్యక్రమంలో భాగంగా పక్షోత్సవాలను ఈ నెల 17 నుంచి 30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది డాక్టర్ విక్టర్ మనోహర్, వైద్యులు సురేశ్‌కుమార్, వినయ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్, సుబ్బరామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు కళాజాగృతి బృందం నాటక ప్రదర్శన

వల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వల్లూరు పోలీసుస్టేషన్ పరిధిలోని ఏపీ మోడల్ స్కూలు, గవర్నమెంటు జూనియర్ కాలేజీలో పోలీసు కళాజాగృతిబృందం ఓ యువతా మేలుకో పేరుతో అవగాహన నాటక ప్రదర్శన చేపట్టింది. ఎస్ఐ పెద్ద ఓబన్న మాట్లాడుతూ మత్తుపదార్థాలపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు కాల్ చేసి తెలిపాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని పీఎస్‌యూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం కడపలోని ఆర్ఎస్‌పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు అయిన డిగ్రీ అడ్మిషన్లు, బీఎస్‌సీ-జీఎన్ఎం నర్సింగ్ కౌన్సిలింగ్ పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు గోపి, కేశవ, హరి,రత్నపాల్, నరసింహ పాల్గొన్నారు.



రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పలువురు అధికారులు


వేముల... రాచకుంటపల్లెలో నిర్వహిస్తున్న రైతన్నా... మీకోసం కార్యక్రమంలో అధికారులు

లింగాల,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగా రైతులు పంటలు సాగుచేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పట్ల గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాలలో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వేముల..: మండలంలోని రాచకుంటపల్లె గ్రామంలో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ రామశివదీక్షిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ఫార్మర్ యాప్ లాభాలగురించి వివరించారు. ఐదు సూత్రాలను సవివరంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార రంగయ్య, ఏఓ ఓబులేసు, పట్టుపరిశ్రమ అధికార వెంకటరామరాజు,వెటర్నరీ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, తహసీల్దార్ రెడ్డిలక్ష్మి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏవో చెన్నారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇ.కొత్తపల్లె, యర్రబల్లె తాండాలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ ఏపీడీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేట..: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం మండలంలోని నెర్సుపల్లె, కొండవాండ్లపల్లె, కుప్పం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవ శుభాకాంక్షలు
మంతెన రామరాజు
ఛైర్మెన్, APIIC
వద్దిబోయిన సాయికిరణ్‌రెడ్డి
స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్
శ్రీ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి
డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్,
స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్, బద్వేలు, కడపజిల్లా.
మా శ్రేయోభిలాషి, ఆప్తులు, నిగర్వి, నిరాడంబరుడు,
అజాత శత్రువు, యంగ్ డైనమిక్ లీడర్
శ్రీ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి అన్న గారు నేడు
ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్
డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న
శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక
శుభాకాంక్షలు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత
పదవులు అలంకరించాలని, ఆయురారోగ్యాలతో
గడపాలనీ కోరుకుంటూ... మీ...
టి. రామానాయుడు
బ్రాహ్మణపల్లె సింగిల్ విండో ఛైర్మెన్
టీడీపీ సీనియర్ నాయకులు
శ్రీనివాసపురం, గోపవరం మం.

లింగ వివక్ష వద్దు.. కలిసికట్టుగా ఉండండి

జమ్మలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష వద్దని అందరూ కలిసి కట్టుగా ఉండి ఆడపిల్లలను రక్షిద్దామని అధికారులు పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో జాతీయస్థాయిలో మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జెండర్ చాంపియన్ కార్యక్రమాన్ని వర్చ్యువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం జెండర్ సమానత్వం కోసం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో సైదున్నీసా, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జయమ్మ, ఏపీఎం గురుకుమార్‌లు మాట్లాడారు.

లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలి

కాశినాయన నవంబరు 25(ఆంధ్రజ్యోతి) లింగ సమానత్వాన్ని ప్రోత్సహించిన నాడే దేశం సంపూర్ణాభివృద్ధి సాధించినట్లవుతుందని డీఆర్‌డీఏ ఏపీఎం అనంతయ్య పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురంలోని వెలుగు కార్యాలయంలో జెండర్ క్యాంపైన్ కార్యక్రమం నిర్వహించారు..అనంతరం సభ్యులతో కలిసి గ్రామంలో ర్యాలీ మానవహారం ఏర్పాటు చేశారు. సీసీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ విద్యార్థి ఉన్నతికి తోడ్పాటు

పోరుమామిళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉన్నతికి క్రమశిక్షణ అతి ముఖ్యమైనదని పోరుమామిళ్ల సీఐ హేమసుందరరావు తెలిపారు. మంగళవారం పోరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల ఇంట్రాక్షన్ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన బాల్యవివాహాలు, ఈవ్‌టీఆజింగ్‌పై విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బందులు వచ్చినా 100కు ఫోను చేయాలని ఆయన కోరారు.

పంట మార్పిడితో రైతులకు లబ్ధి


రైతులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పంట మార్పిడి పద్ధతిని పాటించి ప్రభుత్వం చేపట్టే రైతు సంక్షేమ పథకాలకు సహకరించాలని ప్రొద్దుటూరు తాలూకా స్పెషల్ ఆఫీసర్, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.ఓబుళమ్మ పేర్కొన్నారు. మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోపవరం గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రామాంజనేయులు, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి వరహరికుమార్, పాల్గొన్నారు.

రాజుపాలెంలో: కొర్రపాడు గ్రామంలో రైతన్నా.. మీకోసం నిర్వహిస్తున్న రైతు కుటుంబాల సర్వేను జడ్పీ సీఈవో .ఓబుళమ్మ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రాయితీతో పనిముట్లు బిందు సేద్యం పరికరాలు డ్రోన్లను రైతులకు అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అట్లూరులో: రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి లాభాలు పొందినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని జిల్లా జాయింట్ డైరెక్టరు చంద్రనాయక్ తెలిపారు. మంగళవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన పంచసూత్రాలను వివరించారు. కార్యక్రమంలో బద్వేలు ఏడీ వెంటసుబ్బయ్య, వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

దువ్వూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. దువ్వూరు మండలంలో మంగళవారం ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. పంట నూర్పిడి చేసి అమ్మేందుకు సిద్ధమైన నేపథ్యంలో గిట్టుబాటు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతు సంఘం నాయకులు పెద్దపుల్లయ్య, రామమూర్తి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేష్‌కు ఎమ్మెల్యేల పరామర్శ


ఎంపీ సీఎంరమేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్‌రాజు, పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎంరమేష్‌ను పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పోట్లదుర్తిలోని ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. సీఎం రమేష్ తల్లి రత్నమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గత వారంరోజులుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆమెను పోట్లదుర్తికి తీసుకొచ్చారు. ఆమె పరిస్థితి ఇప్పటికి క్రిటికల్‌గానే ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎం.లింగారెడ్డి, షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, పలువురు ప్రముకులు రత్నమ్మను మంగళవారం పరామర్శించి ఆమె ఆరోగ్యంపై ఎంపీ సీఎం రమేష్‌ను, రమేష్ తండ్రి సీఎం మునిస్వామినాయుడుని, సీఎంసురేష్, సీఎం రాజేష్‌ను అడిగితెలుసుకున్నారు.

నేడు ఏపీ ఐఐసీ డైరెక్టర్‌గా ప్రసాద్‌రెడ్డి ప్రమాణ స్వీకారం


వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి ఏపీ ఐఐసీ డైరెక్టర్

బద్వేలుటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేలు పట్టణానికి వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బద్వేలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తనను ఎంతగానో ఆదరిస్తూ నిరంతరం ప్రోత్సహి స్తున్న బద్వేలు నియోజకవర్గ ప్రజానికానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా మన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారాచంద్ర బాబుకు, మంత్రి నారాలోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి


యూనియన్ బ్యాంకును ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

ఖాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మైదుకూరు రోడ్డులో ఇండియన్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వ్యాపారస్తులు, ఖాతాదారులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ఖాతాదారుల సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది చొరవ చూపుతారన్నారు. అలాగే ఖాతాదారులు జానకీరాం మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు సిబ్బంది ఖాతాదారులను ప్రేమానురాగాలతోపాటు ఆప్యాయత చూపుతున్నారని, ఇలాంటివారు ఖాజీపేటలో పనిచేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జోనల్ అధికారి టి.శ్రీనివాసకుమార్, కడప జోనల్ ఆఫీసర్, ఎ.లక్ష్మి తులసి, ఖాతాదారులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా రాజగోపాల్ యాదవ్

ప్రొద్దుటూరు ,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ బుధవారం ఉదయం 10 గంటలకు టీడీడీ కళ్యాణమండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు ప్రొద్దుటూరు టీడీపీ పట్టణ కమిటీ లోని ఉపాధ్యక్షుడుగా ఖలీల్ బాషా, ప్రధాన కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గంజికుంట ఆంజనేయులు, దేరంగుల అంజనమ్మ,షేక్ బాషా, కార్యదర్శులుగా కేశపల్లి పరమేశ్,గుండ్లదుర్తి రాజసింహారెడ్డి, విజయసింహుడు, కోశాధికారి కాకుమాని ఆనంద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డిలు హాజరుకానున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు

ప్రొద్దుటూరు , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పెన్నా నది నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకోని రూరల్ పోలీసు స్టేషనుకు తరలించారు. మంగళవారం రూరల్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో చౌడూరు గ్రామ పరిధిలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుకను నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ చాగలమర్రి ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తుండంతో దాడులు నిర్వహించారు. ఈ ఇసుక అక్రమ రవాణాలో పద్మనాభరెడ్డి అనే వ్యక్తితో పాటు మరికొందరు ఉన్నట్లు పోలీసులు వెల్లడిస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం కాలజ్ఞాన కర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసగృహం వీధి పాతూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గత తొమ్మిదినెలలుగా తాగునీరు లేకపోవడంతో గ్రామ ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం -1లో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో గంపా వెంకటసుబ్బయ్య గ్రామాన్ని సందర్శించి పైపులైను మరమ్మత్తులు చేయించడంతో నీటిసమస్య పరిష్కారమైంది. దీంతో స్థానికులు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ఎంపీడీవో రామచంద్రారెడ్డికి డిప్యూటీ ఎంపీడీవో గంపా వెంకటసుబబ్యకు ధన్యవాదాలు తెలిపారు.

ఫైలేరియా నిర్ధారణపై సర్వే

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధి (బోధ వ్యాధి) నిర్ధారణ కోసం వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. మండల పరిధిలోని చెన్నమరాజుపల్లెలో మంగళవారం రాత్రి ఫైలేరియా వ్యాధి నిర్ధారణ కోసం సుమారు 300 మంది రక్త నమూనాలను సేకరించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బద్వేలురూరల్‌లో: ప్రాథమిక దశలో గుర్తిస్తే ఫైలేరియా వ్యాధి నివారణ సాధ్యమని సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పుట్టాయపల్లెలో ఫైలేరియాపై వైద్య సిబ్బంది ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులను పరామర్శించి వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ముద్దనూరు నవంబర్25(ఆంధ్రజ్యోతి):మండల పరిధి నల్లబల్లె లో నూతన ఆంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ఉదయం గణపతి పూజ, వివిధ పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. బుధవారం యంత్ర అభిషేకాలు, హోమము, గురువారం ధ్వజస్థంభ,విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్న బాబయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయలయ్యాయి. వెంకటాపురంకు చెందిన బాబయ్య బస్టాప్ వద్ద నిలబడి ఉండగా, కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బద్వేలు, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మిపాళెం దళితవాడకు మంచినీరు, డ్రైనేజీ సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ ఇక్కడి డ్రైనేజీ కారణంగా పలువురు రోగాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడిగే వెంకటరమణ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మైలవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడితే 112, 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.